ఖేలో భారత్ క్రీడలు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఖేలో భారత్ క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని బి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జాతీయ కార్యదర్శి శ్రవణ్, బి.రాజ్, గ్రేటర్ నేత రాజశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఓయూ అధ్యక్షులు ధృహన్, కార్యదర్శి శివశంకర్, రాష్ట్ర నాయకులు అలివేలి రాజు, కమల్ సురేష్, హరిప్రసాద్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో మాదిగ విద్యార్థుల సంబరాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు లభించడంపట్ల ఓయూలో మాదిగ విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. సోమవారం మాదిగ విద్యార్థి ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ముశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం శేఖర్‌మాదిగ మాట్లాడుతూ దేశంలో అత్యంత వివక్షతకు గురవుతున్న మాదిగల గుర్తింపు కోసం 30 ఏళ్లుగా పోరాడిన మంద కృష్ణ త్యాగాలను కేంద్రం గుర్తించి పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసిందని పేర్కొన్నారు.

యూజీసీ నిబంధనలు వెనక్కి తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నిజాం కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో యూజీసీ–2025 చేపట్టిన నిబంధనలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలలో వైస్ ఛాన్స్‌లర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు సంబంధించి నిబంధనల మార్పుల కోసం ఇటీవల యూజీసీ జారీ చేసిన ముసాయిదా మార్గదర్శకాలు మన ఉన్నత విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. యూజీసీ మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేని యెడలా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, నాయకులు జ్ఞానేశ్వర్, ప్రవీణ్, నిఖిత, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని పద్మశ్రీ పురస్కార గ్రహీతలు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పుల్లెల గోపీచంద్ అన్నారు. సోమవారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అనంత్ బజాజ్ మెమోరియల్ తెలంగాణ రాష్ట్ర ఓపెన్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రతిభను కనబరిచారు. అండర్–11 బాలికల విభాగంలో జరిగిన ఫైనల్ పోటీల్లో శాన్వి లట్టాల, ఎవిలిన్ ప్రియాంక జోడీలు ఫైనల్ పోటీల్లో గెలిచి బంగారు పతకాన్ని పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు.

పాత పెన్షన్ విధానం అమలుకు వినతి

మలక్‌పేట: పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సైదాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ మండల తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అంజనేశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేని నేషనల్ పెన్షన్ స్కీమ్‌లో భాగంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సీపీఎస్ విధానాన్ని ఉద్యోగులు దేశ వ్యాప్తంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. దీన్ని రద్దుచేసి 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో వెంకట్‌రెడ్డి, సాంబశివరావు, రఘువీర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి ఉన్నారు.

జక్కయ్యకు ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ పురస్కారం

మలక్‌పేట: విధి నిర్వహణలో ఉత్తమ క్రమశిక్షణ ప్రదర్శించి, రాష్ట్రస్థాయి టోర్నమెంట్లు నిర్వహించి విద్యార్థులను జాతీయస్థాయికి పంపించడంలో కీలకపాత్ర పోషించిన ఓల్డ్‌మలక్‌పేట ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్, ఎస్‌జీఎఫ్ గేమ్స్ అండర్–19 జూనియర్ కాలేజెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జక్కయ్య ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ పురస్కారం అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా అవార్డు అందుకోవడంతో తోటి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల కబ్జాలు

నా పేరు పాదచారి..



ఫుట్‌పాత్‌లపై పడేసిన తోపుడు బండ్లు

ఒకప్పుడు ఫుట్‌పాత్ అంటే పాదచారులు వెళ్లే దారి అని చెప్పేవాళ్లు. కానీ ప్రస్తుతం ఫుట్‌పాత్‌కు అర్థమే మారిపోయింది. ఫుట్‌పాత్ కొందరికి ఫుడ్‌పాత్ అయితే చిరువ్యాపారులకు మంచి స్పాట్ అయ్యింది. పాదచారులు నడవాల్సిన ఫుట్‌పాత్‌లపై దుకాణాలు నడుస్తున్నాయి. దీంతో పాదచారి దారి రోడ్డుపైకి వచ్చింది. ప్రమాదకరమని తెలిసినా రోడ్డుపై నుంచే నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అప్పుడప్పుడు ప్రమాదాల బారిన పడుతూ.. టైమ్ మంచిగున్నప్పుడు బతికి బయటపడుతున్నారు. అధికారులు మొద్దునిద్ర వీడకపోవడంతోనే మా దారులు కబ్జాకు గురవుతున్నాయని పాదచారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

నాకు లేదు నడిచే దారి!



ఫుట్‌పాత్‌ను అక్రమించి మట్టి అమ్మకాలు

కాచిగూడ: రహదారులపై అక్రమ పార్కింగ్, ఫుట్‌పాత్‌ల కబ్జాలతో నారాయణగూడలో పాదచారులు నిత్యం పడరాని పాట్లు పడుతున్నారు. రద్దీగా ఉంటే నారాయణగూడ వైఎంసీఏ జంక్షన్, మెట్రో స్టేషన్, శాంతి సినిమా థియేటర్, ఐపీఎం, రెడ్డి ఉమెన్స్ కాలేజ్, ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎంబీఏ కాలేజీ, మాడపాటి హనుమంతరావు హైస్కూల్ తదితర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లు పూర్తిగా కబ్జా గుప్పిట్లో ఉన్నాయి. వైఎంసీఏ సర్కిల్ నుంచి బర్కత్‌పుర చమన్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో రోడ్లపై టిఫిన్ సెంటర్లు, మెస్‌లు తోపుడు బండ్లు ఉంటున్నాయి. దీని వల్ల పాదచారులు, ప్రయాణికులే కాకుండా పాదచారులు అవస్థలు పడుతున్నారు. వైఎంసీఏ వద్ద ఫుట్‌పాత్ మొత్తాన్ని పూల కుండీలు, మొక్కలు అమ్ముకునే వ్యాపారులు కబ్జా చేశారు. టిఫిన్ సెంటర్ల ముందు రోడ్లపైనే ఆటోలు, టూవీలర్స్‌ను నిలిపి ఉంచడంతో రోడ్లు కుంచించుకుపోయాయి.

చూసీచూడనట్లు...

నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తా నుంచి బర్కత్‌పుర చమన్ రోడ్డు, కాచిగూడ చౌరస్తా రోడ్డు, నారాయణగూడ ఫ్లైఓవర్ రోడ్డు, కింగ్‌కోఠి రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించే వారి నుంచి బల్దియా, ట్రాఫిక్ సిబ్బంది నెలవారి మామూళ్లు తీసుకుంటూ వ్యాపారులకు అండదండగా నిలుస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.



నారాయణగూడ వైఎంసీఏ సర్కిల్ వద్ద ఫుట్‌పాత్‌ను కబ్జాచేసి మొక్కలు వ్యాపారం



ఫుట్‌పాత్ అక్రమించి అడ్డుగా ఏర్పాటు చేసిన కంచె.



ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన మెస్

జర్నలిస్టులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న జర్నలిస్టులతో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ప్రముఖ సంపాదకులు కె.రామచంద్రమూర్తి

చిక్కడపల్లి: నేటి సమాజంలో మనుషుల మధ్య ఆప్యాయతలు అనుబంధాలు మాయమైపోతున్నాయని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆవేదన వ్యక్తం చేశారు. త్యాగరాయ గానసభలో సోమవారం విద్యార్థి నేత ఫణి భార్గవ్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ... మరణించిన కుమారుడి పేరతో ప్రతి ఏటా జర్నలిస్టులకు ప్రతిభా పురస్కారాలు అందించడం అభినందనీయమని అన్నారు. అంతే కాకుండా విద్యార్థులకు సామాజిక సేవా సంస్థలకు ఆర్థిక సహాయం చేయడం వారి సేవా నిరతిని తెలియజేస్తోందన్నారు. అనంతరం జర్నలిస్టులు నవీన్, రాధిక, జ్యోతికి ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. విద్యార్థి క్రాంతి అమృత వర్షిణి సేవా సంస్థకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞానకేంద్రం మేనేజింగ్ కార్యదర్శి వినయ్‌కుమార్‌ను ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం ప్రముఖ సంపాదకులు రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. ఫణి భార్గవ్ యుక్త వయస్సులోనే చైతన్యవంతమైన కార్యక్రమాలను చేపట్టారని గుర్తిచేశారు. ఈ కార్యక్రమంలో ఎంకే రాము, కళా జనార్దనామూర్తి, బైసా దేవదాసు, ఆర్‌వీ రమణ, వినయ్‌కుమార్,. నవీన్, రాధిక, జ్యోతి, క్రాంతి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లు కూడా ఆత్మహత్యలు చేసుకోవాలా.?

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రబాబు



మాట్లాడుతున్న అధ్యక్షుడు రాజేంద్రబాబు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రైతుల తరహాలో పెన్షనర్లు కూడా ఆత్మహత్యలు చేసుకుంటే తప్పా పెన్షనర్లకు సంబంధించిన డబ్బులు ఇవ్వరేమోనని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ... ఇటీవల రిటైర్డ్ అయిన వాళ్లకు ఉద్యోగ విరమణ సమయంలో రావాల్సిన డబ్బులు చెల్లించకపోవడం అత్యంత దారుణమని అన్నారు. ఇంత కాలం దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సహించరానిదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. బకాయిపడ్డ 4 డీఏ, డీఆర్‌లు వెంటనే విడుదల చేయాలని పెన్షనర్లకు అన్ని ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని మెడికల్ బిల్లులు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంవీ నర్సింగ్ రావు, ఆర్థిక కార్యదర్శి బి.నర్సయ్య పాల్గొన్నారు.

అన్యాయం వల్లే 30 ఏళ్లుగా ఉద్యమం సజీవం

మందకృష్ణ మాదిగ

పంజగుట్ట: తమకు అన్యాయం జరిగిందన్న బలమైన భావన మాదిగల్లో ఉండడం వల్లే ఎమ్ఆర్‌పీఎస్ ఉద్యమం 30 సంవత్సరాలుగా సజీవంగా ఉందని ఎమ్ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి, బ్రాహ్మణ, ఆర్యవైశ్య మిత్ర మండలి, బ్రాహ్మణ సంఘాలు, కురుమ రిజర్వేషన్ పోరాట సమితిలు ఎస్సీ వర్గీకరణ కోసం ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించనున్న లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమానికి సంఘీభావంగా సమావేశం ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రకటించడం, ఫిబ్రవరి 7న జరిగే కార్యక్రమం విజయవంతం కావాలని వేద బ్రాహ్మణులు మంత్రోచ్ఛారణతో ఆయనకు ఆశీర్వాదం పలికారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ ఎమ్ఆర్‌పీఎస్ ఏ కులానికి ఏ మతానికి వ్యతిరేకం కాదన్నారు. కులం అనేది మనం సృష్టించుకున్నది కాదని, అది వందల, వేల సంవత్సరాల నుంచి వస్తుందన్నారు. ఏ కులమైనా, ఏ మతమైనా మనం భారతీయులుగా కలిసిఉంటే అసమానతలు ఉడవని అన్నారు. మన మధ్య ఉన్న అసమానతలు మనమే పరిష్కరించుకుంటే అఖండ భారత్ సాధించుకోవచ్చునని అన్నారు. 59 కులాలు ఉన్న ఎస్సీల్లో 58 కులాలు వర్గీకరణ కోరుకుంటున్నాయని, మాలల్లో కూడా కొంత మంది స్వార్థపరులే దీన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

శంకరమఠం మార్కెట్ రోడ్డు ఆక్రమణ!

ప్రజావాణిలో జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఎన్‌సీఏ ఫిర్యాదు



శంకరమఠం మార్కెట్ రోడ్డు ఆక్రమించి రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు

నల్లకుంట: నల్లకుంట శంకరమఠం మార్కెట్ రోడ్డులో వ్యాపారులు రోడ్డు ఆక్రమించడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్(ఎన్‌సీఏ) ప్రతినిధులు అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీఏ ప్రతినిధులు మాట్లాడుతూ.. 50–60 ఫీట్ల వెడల్పుతో ఉన్న మార్కెట్ రోడ్డును వ్యాపారులు ఆక్రమించడంతో 25–30 ఫీట్లకు కుంచించుకుపోయిందని అన్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని కమిషనర్‌కు తెలిపామన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఎన్‌సీఏ సలహాదారులు డి. రామకృష్ణారావు, డాక్టర్ జయసూర్య, అధ్యక్షుడు వి.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి డి.మోహన్‌రావు, నిర్వహణ అధికారి వీరయ్య తదితరులు ఉన్నారు.

రేపు కామర్స్ టాలెంట్ టెస్ట్

ఖైరతాబాద్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల, ఆంబిషన్స్ కేరీర్ కౌన్సిల్, వాసవి క్లబ్ హైదరాబాద్ సంయుక్తంగా ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటలకు ఐఐఎంసీ కళాశాలలో కామర్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కామర్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. జూనియర్ కళాశాల విద్యార్థులు మాత్రమే ఈ పరీక్ష రాసేందుకు అర్హులని, ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 9052810304, 9493976082 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యకే ప్రథమ ప్రాధాన్యం



సాక్షి, సిటీబ్యూరో: పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడమే తల్లిదండ్రుల మొదటి ప్రాధాన్యంగా నిలవాలని ఐడీబీఐ సీజీఎం శరత్ కామత్ అన్నారు. సోమవారం న్యూబాకారం ప్రభుత్వ పాఠశాలలో సీఆర్ఎస్ నిధులతో నిర్మించిన తరగతి భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ తరఫున కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కార్యక్రమంలో చేపడుతున్న పనుల్లో విద్య, ఆరోగ్య రంగాలకు అండగా నిలుస్తున్నామని అన్నారు.ఈ పాఠశాలకు వచ్చినపుడు తరగతులకు సరిపడా గదులు లేకపోవడంతో తరగతి గదిని నిర్మించామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆర్ హెచ్ పట్నాయక్, ముషీరాబాద్ శాఖ మేనేజర్ దీప్తి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు

చాదర్‌ఘాట్: ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్–6 మలక్‌పేటలో రెండు ఫిర్యాదులు అందాయని డీసీ జయంత్ తెలిపారు. అజంపురా డివిజన్ నుంచి మసీదుల వద్ద శానిటేషన్ చేయటం లేదని, అదే విధంగా ఓల్డ్‌మలక్‌పేటలో మూసీ పరీవాహక ప్రాంతానికి ఆనుకుని అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు.

మహిళా సాధికారతే దేశ సాధికారత



అంబేడ్కర్ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పీఎస్ఎన్ మూర్తి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మహిళా సాధికారతే దేశ సాధికారతకు ఏకైక మార్గమని పలువురు వక్తలు అన్నారు. మహిళల సాధికారతకు బాటలు వేసిన సావిత్రిబాయి పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్ లాంటి వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాలలో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దళిత స్త్రీ శక్తి కన్వీనర్ గడ్డం ఝాన్సీ, ఐడీఏఎస్ చీఫ్ అడ్వైజర్ పీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ... స్త్రీలు సాధికారత కోసం ఎంచుకునే మార్గాలు స్వార్థపూర్వకంగా ఉండకూడదన్నారు. దేశ సమగ్ర సాధికారతకు తోడ్పడాలన్నారు. స్త్రీ సాధికారతకు తోడ్పడే విద్యా, వికాసం, విజ్ఞానం పొందాలని సూచించారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగబద్ధమైన పరిపాలనలో స్త్రీలు భాగస్వాములు కావాలని కోరారు. అంబేడ్కర్ చూపించిన దారిలో సమానత్వంతో మనమంతా మెలగాలని, దానికోసం యువతరం హేతుబద్ధంగా ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియా, సిద్ధోజిరావు, అప్పలయ్య, విజయేంద్రకుమార్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలి



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం సమర్పిస్తున్న గౌడ జన హక్కుల పోరాట సమితి నేతలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గౌడ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో 2లక్షల 25వేల మంది గౌడ వృత్తిదారులు కల్లుగీత వృత్తిమీద ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. వృత్తిలో ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ కిట్స్ పంపిణీ చేయాలని, వృత్తిలో మరణించిన అంగవైకల్యం పొందిన కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియోను వెంటనే చెల్లించాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో గౌడలకు ఇచ్చిన హామీలు అమలయ్యేలా ప్రత్యేక జీవో జారీ చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి గౌడల అన్ని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరాట సమితి ప్రధాన కార్యదర్శులు దుర్గా గౌడ్, మూలా వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, విక్కి, బుచ్చన్న, చిత్తలూరు నారాయణ, రాజు గౌడ్, దేవేందర్, శ్రీనివాస్ గౌడ్‌లు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

జెడ్‌సీకి కార్పొరేటర్ పావని విజ్ఞప్తి



కమ్యూనిటీ హాల్.. సౌకర్యాలు నిల్!

సాక్షిలో వచ్చిన కథనం

చిక్కడపల్లి: డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి యుద్ధప్రాతిపాదికన చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ పావని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో ఆమె కలసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సామాజిక భవనంలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.జీహెచ్ఎంసీకి రుసుము చెల్లించగా తాగునీరు బయటి నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విద్యుత్ సరఫరా సరిగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇప్పుడైనా సామాజిక భవన అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జెడ్‌సీని కోరారు. ఈ సమస్యలను 'సాక్షి'వెలుగులోకి తీసుకురావడంపై కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మల్లేష్, సభ్యులు మహేందర్, కృష్ణ, షరీఫ్ పాల్గొన్నారు.

నాలా విస్తరణ పనులెప్పుడు.?

వర్షాకాలం ముందే పూర్తి చేయాలని పద్మాకాలనీ వాసుల డిమాండ్



పద్మాకాలనీలో విస్తరణ చేపట్టాల్సిన నాలా

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పద్మాకాలనీ నాలా విస్తరణ పనులకు మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని ఆయా కాలనీవాసులు ఎప్పుడెప్పుడా.? అని ఎదురు చూస్తున్నారు. గతేడాది నవంబర్‌లో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పద్మాకాలనీ నాలా విస్తరణ పనులకు ఆమోదం లభించినట్లు సమాచారం. గురుదత్తా స్కూల్ లేన్‌లో ఇరువైపుల కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న నాలా విస్తరణ పనులు పూర్తికాకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు పనులు మొదలు పెడుతారో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని కాలనీ వాసులు వాపోతున్నారు. మళ్లీ వర్షాకాలం ప్రారంభం కాకముందే పనులను పూర్తిచేసి ముంపు సమస్యను నుంచి కాపాడాలని కోరుతున్నారు.

◆ అనేక ధర్నాలు, నిరసనలు తెలిపిన తరువాత అప్పటి మంత్రి కేటీఆర్ స్పందించి ఎస్ఎన్‌డీపీ (స్ట్రాటెజిక్ నాలా డవలప్‌మెంట్ ప్రోగ్రామ్) కింద నాగమయ్యకుంట, పద్మాకాలనీ, కోరెంటి, నల్లకుంట నాలా విస్తరణ పనులకు రూ.72కోట్లు మంజూరు చేశారు. ఆ నిధుల్లో దాదాపు రూ.42కోట్ల వరకు ఖర్చు చేశారు. అయితే పెండింగ్‌లో ఉన్న నాలా విస్తరణ పనులకు రూ.3.5కోట్లు ఖర్చు అవుతుందని ఆయా శాఖల వారు అంచనా వేశారు.

◆ ఈ నాలా విస్తరణ పనులు జరిగితే పద్మాకాలనీతో పాటు ఓల్డ్ రామాలయం నల్లకుంట వీధి నుంచి కోరెంటి చౌరస్తా వరకు నాలాలో వరద నీరు సాఫీగా ప్రవహిస్తుంది. ఇక్కడ విస్తరణ పనులు పూర్తయితేనే పద్మాకాలనీ, రామాలయం వీధి ముంపునకు గురికాకుండా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి త్వరితగతిన పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

వర్షాకాలం కంటే ముందే పూర్తి చేయాలి



నాలా విస్తరణ పనులను వర్షాకాలం ప్రారంభం కాకముందే పూర్తి చేయాలి. పెండింగ్ పనులపై ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి.

– రితీష్‌కుమార్, పద్మాకాలనీ కన్వీనర్

ముంపు నుంచి కాపాడాలి



పద్మాకాలనీ వాసులను ముంపు నుంచి కాపాడాలి. అనేక పోరాటలు చేసి నాలా విస్తరణ పనులు చేపట్టేలా చేశాం కొంత వరకు పనులు చేపట్టి వదిలి వేశారు. అధికారులు వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయాలి.

– మోహన్, పద్మాకాలనీ నివాసి